# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**డిసెంబరు 10, 2017**

## పాలస్తీనా పోరాట ప్రజలతో దృఢంగా నిలబడుదాం

70 ఏళ్లుగా మధ్య ప్రాచ్యంలో అరబ్బు ప్రజలకు శాంతి కరువైంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అక్కడ అశాంతి కుంపటి రాజేసిన ఏకైక దోషి అమెరికా. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అది సృష్టించిన వినాశనాలలో ఇది వ్యూహాత్మకమైనది. హిరోషిమా, నాగసాకిలలో అణుబాంబులను పేల్చి లక్షలాది ప్రజల జీవితాలను బలిగొని ప్రపంచంలో అతి భయంకర తొలి ఉగ్రవాదిగా నిల్చిన అమెరికా దూర ప్రాచ్యంలో యూదులతో కూడిన ఇజ్రాయిల్ దేశాన్ని నెలకొల్పింది. ఈ చర్య గత 7 దశాబ్దాలుగా అక్కడి అరబ్ ప్రజల సమైక్యతను దెబ్బతీస్తూ వారి మధ్య చీలికలను సృష్టించి తన ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి దానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

అమెరికా సామ్రాజ్యవాదం తన ప్రపంచాధిపత్యం, లాభార్జన కోసం నిరంతరం అరబ్ ప్రజలను తన ఏకపక్ష దురాక్రమణ యుద్ధ చర్యలకు బలిగొంటూనే ఉన్నది. 21వ శతాబ్దం ప్రారంభంలో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై తన సైన్యాలతో, తను సృష్టించిన నాటో సైన్యాలతో యుద్ధానికి దిగి భారీ వినాశనానికి తలపడింది. అక్కడ ఇప్పటికీ రోజూ యుద్ధ కీలలు మండుతూనే ఉన్నాయి. ప్రపంచంలో మరే దేశం కన్నా భారీ నేరస్తురాలు ఉగ్రవాద అమెరికా సామ్రాజ్యవాదమేనన్నది ప్రజలెవరూ మర్చిపోరు.

ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల పరంపరలో ఈ శతాబ్దం రెండో దశాబ్దం నుండి పశ్చిమాసియా-ఉత్తర ఆఫ్రికాలలోని అరబ్ దేశాలలో అక్కడి నియంతలను తొలగించే పేరుతో అక్కడ యుద్ధ జ్వాలలను రగిలించింది. 'ప్రభుత్వ మార్పిడి' పేరుతో ఆయా దేశాలలోని పాలక వర్గాల ప్రత్యర్థి ముఠాల మధ్య గల వైరుధ్యాలను సొమ్ము చేసుకుంటూ తన అనుకూల తోలుబొమ్మ ప్రభుత్వాల స్థాపనకు చేపట్టిన యుద్ధ చర్యలలో ఆ దేశాలు ఇప్పటికీ తల్లడిల్లుతున్నాయి. అరబ్ జాతీయవాదం పేరుతో అనేక ఉగ్రవాద గ్రూపులకు తెరలేపిన ఘనత ఆ మహా ఉగ్రవాద అమెరికా సామ్రాజ్యవాదేనన్నది స్పష్టం. ఇప్పటికీ సిరియాలో కొనసాగుతున్న వినాశకర యుద్ధం సామ్రాజ్యవాద దేశాల మధ్య గల వైరుధ్యాల ప్రతిబింబమే. ప్రపంచంలో ఎన్నడూ లేని స్థాయిలో ముందుకు వచ్చిన శరణార్థుల సమస్య వారి సృష్టే. ప్రజాస్వామ్యం స్థాపన పేరుతో ప్రపంచంలో ఎక్కడైనా దాని ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను ఈడేర్చుకోవడమే దాని ప్రపంచాధిపత్య వ్యూహం. దీనిని యావత్తు ప్రజానీకం తరతమ స్థాయిలలో అంతటా ప్రతిఘటిస్తూనే ఉన్నారు.

గత సంవత్సరం అమెరికా ఎన్నికలలో అధ్యక్ష పదవికి ఎన్నికై బాధ్యతలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే అనేక వివాదాలకు తెరలేపాడు. తన కరడు గట్టిన ఇస్లాం వ్యతిరేక స్వభావాన్ని తడవ తడవకూ చాటుకుంటున్నాడు. ముస్లిం దేశాల ప్రజలకు అమెరికాకు వచ్చేందుకు వీసాలను నిరాకరించడం, శరణార్థులను అమెరికాలోకి నిరాకరించడం, అరబ్ ప్రజల మధ్య చీలికలను నిత్యనూతనం చేస్తూ చర్యలు చేపట్టడం లాంటి అనేకం ఈ ఏడాది కాలంలో ముందుకు వచ్చాయి. తాజాగా ఇజ్రాయిల్‌కు రాజధానిగా జెరుసెలెంను గుర్తిస్తూ చేసిన అహంభావ ప్రకటన దూరప్రాచ్యంలో మరో మారు మంటలను ఎగదోసింది. ఇప్పటికీ అరబ్ దేశాల మధ్య విశాల భూభాగాలను స్వాధీనం చేసుకుని టెల్ అవీవ్‌ను రాజధానిగా ఏర్పరచుకున్న ఇజ్రాయిల్‌కు అమెరికా చేసిన తాజా ప్రకటన పరమ సంతోషాన్ని కలిగించింది. కానీ యావత్ప్రపంచ ప్రజానీకం ఐరాసతో సహా సమస్త దేశాలూ అమెరికా చర్యను ఖండిస్తున్నాయి. జెరూసెలెంను తమ పవిత్ర భూమిగా భావిస్తూ తమ భావి సంపూర్ణ పాలస్తీనా స్వతంత్ర దేశానికి దానిని రాజధానిగా భావిస్తున్న పాలస్తీనా ప్రజల ఆకాంక్షలను ఛిద్రం చేస్తూ ట్రంప్ చేసిన ప్రకటన మరో విడత ఆ ప్రాంతంలో ఇజ్రాయిల్ యుద్ధోన్మాద చర్యలకు ఊతం ఇస్తోంది. ఈ చర్యను నిర్ద్వంద్వంగా ఖండిస్తూ ప్రపంచ ప్రజల సరసన నిలిచి మన దేశ ప్రజానీకం పాలస్తీనా ప్రజల ఆకాంక్షలను ఎత్తిపట్టాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తుంది.

అమెరికా ప్రకటన పట్ల భారతదేశం అనుసరిస్తున్న వైఖరిని నిర్ద్వంద్వంగా ఖండించాలి. మన దేశంలో అధికారంలో ఉన్న బ్రాహ్మణీయ

మతోన్మాద శక్తులు అమెరికా విధానాలను సమర్థిస్తూ ఇజ్రాయిల్‌తో స్నేహ బంధాలు పటిష్టం చేసుకుంటున్నాయనడానికి ఇటీవల దేశ ప్రధాని మోడీ ఇజ్రాయిల్ పర్యటన పెద్ద తార్కాణం. ఇజ్రాయిల్‌తో భారత ప్రధాని చేసుకున్న రక్షణ, దేశ భద్రతతో సహా ఒప్పందాలన్నీ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టేవే. అమెరికా జెరుసెలెంను ఇజ్రాయిల్ రాజధానిగా ప్రకటించగానే ఇతర దేశాలలాగా భారతదేశం నిర్ద్వంద్వంగా ఖండించకపోవడం తన ఇస్లాం వ్యతిరేకతతో పాటు అమెరికాకు వంత పాడే బుద్ధిని చాటుతున్నది. దీనిని ఖండిస్తూ భారత ప్రజలు అరబ్ ప్రజలకు అండగా నిలిచి మరో క్రూసేడ్‌కు శంఖం ఊదిన ట్రంప్ చర్యను, అతగాడికి తోడు దొంగగా నిలిచిన కాషాయ ఉగ్రవాదుల వైఖరులను ఎండగట్టాలని మా పార్టీ కోరుతున్నది.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**